క్లుప్తంగా

మత్తుపదార్థాల నిర్మూలనపై అవగాహన



మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయుడు

కోదాడరూరల్ : గంజాయి వంటి మత్తు పదార్థాలకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని సూర్యాపేటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, సామాజిక వేత్త రాచకొండ ప్రభాకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల, మార్కెట్ ప్రాంతాల్లో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కలిగించి మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్, మద్యం, గుట్కాల వంటి చెడువ్యసనాలతో అనేక మంది తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నారని, దీంతో వారిని నమ్ముకొని ఉన్న కు టుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. మత్తుపదార్థాల బారిన పడకుండా ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు సెలవు దినాలలో ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

డీవైఎఫ్‌ఐ కమిటీ ఎన్నిక




బచ్చలకూర సురేందర్ బచ్చలకూర రవీందర్

మునగాల : మండలంలోని నేలమర్రి గ్రామంలో ఆదివారం బచ్చలకూర రామ్‌చరణ్ అధ్యక్షతన డీవైఎఫ్‌ఐ గ్రామ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం గ్రామశాఖను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ నూతన అధ్యక్షుడిగా బచ్చలకూర సురేందర్, ప్రధాన కార్యదర్శిగా బచ్చలకూర రవీందర్, ఉపాధ్యక్షులుగా బచ్చలకూర రామాంజనేయులు, బచ్చలకూర కిరణ్, సహాయ కార్యదర్శులుగా కొలికపంగు నాగేశ్వరరావు, జిల్లేపల్లి మధు, సోషల్‌మీడియా ఇన్‌చార్జ్‌గా బచ్చలకూర ప్రశాంత్, కోశాధికారిగా గుడిపూడి నరేష్, కమిటీ సభ్యులుగా బచ్చలకూర సికిందర్, బచ్చలకూర ఉదయ్, సుందరయ్య, నవదీప్, మనిదీప్, మనోజ్, నరేష్, మనోజ్, తేజ, కార్తీక్ ఎన్నికయ్యారు. సమావేశంలో డీఐఎఫ్‌ఐ మాజీ నాయకుడు బట్టుపల్లి ఉపేందర్, సీపీఎం నాయకులు బచ్చలకూర స్వరాజ్యం, బచ్చలకూర సుధాకర్, బచ్చలకూర చక్రి, మామిడి గోపయ్య, బచ్చలకూర రాంబాబు, రాయి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రంథాలయ పార్ట్ టైం స్వీపర్స్ కమిటీ ఎన్నిక




పిట్టా హుస్సేన్ కస్తాల మధు

హుజూర్‌నగర్ : హైదరాబాద్‌లో గ్రంథాలయ పార్ట్ టైం స్వీపర్స్ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కస్తాల మధు తెలిపారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా ఎలగందుల శ్రీనివాస్, అధ్యక్షుడిగా పిట్టా హుస్సేన్ (నేరేడుచర్ల), ప్రధాన కార్యదర్శిగా కస్తాల మధు (హుజూర్‌నగర్), ఉపాధ్యక్షులుగా చింతకింది ఎల్లం (ములుగు), హెచ్.అంకుష్‌కుమార్ (సంగారెడ్డి), కోశాధికారిగా కె.మధుసూదన్ (పెన్‌పహాడ్), సహాయ కార్యదర్శులుగా ఎస్‌డీ సలీం (ఆసిఫాబాద్), సీహెచ్.స్వామి (మంచిర్యాల)తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి

నేరేడుచర్ల : గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని, అందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చినవెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామగ్రామాన పార్టీ చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కట్టా రామారావు, తాళ్ల సురేష్‌రెడ్డి, రాపోలు నర్సయ్య, రాచకొండ అజయ్, కొణతం సీతారాంరెడ్డి, బచ్చలకూరి ప్రకాశ్, చిత్తనూరి సత్యనారాయణ, శ్రీను, సైదులు, నర్సింహారావు, కృష్ణమూర్తి, నాగయ్య, ఖరీముల్లా, పాండు, నాగయ్య, పున్నమ్మ తదితరులున్నారు.

ఇంటి అక్రమ నిర్మాణం పరిశీలన

చివ్వెంల : బి.చందుపట్లలో దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్న భూమిలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అక్రమంగా ఇంటి నిర్మాణం చేపట్టాడు. దీంతో ఈఓ కుశలయ్య ఆదివారం గ్రామంలోని ఆలయ భూమిలో నిర్మిస్తున్న ఇంటిని పరిశీలించారు. సంబంధిత వ్యక్తిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణం వెంటనే ఆపివేయాలని ఆదేశించారు. లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు పిర్యాదు చేస్తానని పేర్కొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..!

- కోదాడ పెద్దచెరువు అలుగు వంతెనకు ఇరువైపులా కానరాని రక్షణ గోడలు
- వర్షాకాలంలో రోడ్డుపై ప్రవహిస్తున్న చెరువు నీరు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



కోదాడ- అనంతగిరి రోడ్డులో పెద్దచెరువు అలుగువద్ద ప్రమాదకరంగా ఉన్న వంతెన

కోదాడ : కోదాడ పట్టణం నుంచి అనంతగిరి వెళ్లే రోడ్డులో ఖానాపురం సమీపంలో కోదాడ పెద్దచెరువు అలుగు ప్రమాదకరంగా మారింది. చెరువు అలుగు నీరు పారడానికి 50సంవత్సరాల క్రితం నాలుగు గూనలతో వంతెనను ఏర్పాటు చేశారు. ఇటీవల రోడ్డు విస్తరణ జరిగినా ఈ వంతెనను మాత్రం విస్తరించలేదు. అదే విధంగా వంతెనకు ఇరువైపులా కనీసం రక్షణ గోడలు కూడా ఏర్పాటు చేయలేదు. వర్షాకాలంలో చెరువు అలుగు పారితే నీరు వంతెన కనబడకుండా రోడ్డుమీదుగా ప్రవహిస్తుంది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతుంది. ఈ రోడ్డులో నిత్యం రెండు మండలాలకు చెందిన 20గ్రామాల ప్రజలు ప్రయాణిస్తుంటారు. సూర్యాపేట–ఖమ్మం జిల్లాలను కలిపే రహదారి కూడా ఇదే. అంతే కాకుండా ఇక్కడ ఉన్న ఇంజనీరింగ్ కళాశాలకు నిత్యం వేల మంది విద్యార్థులు, వందల బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇంత ప్రాధాన్యం కలిగిన రహదారిపై వంతెన అత్యంత ప్రమాదకరంగా ఉన్నా ప్రజాప్రతినిధులు, అధికారులు నిత్యం ఈ వంతెనపై ప్రయాణం చేస్తున్నా దీని గురించి మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. నిత్యం ప్రమాదాలు జరగడమేకాక వర్షాకాలం వలసే వంతెన ఖానాలు మూసుకొనిపోయి నీరు రహదారి మీదుగా ప్రవహిస్తుంటుంది. దీంతో 20గ్రామాల ప్రజలు మరో 10కిలోమీటర్లు చుట్టూ తిరిగిపోవాల్సి ప్రయాణాలు చేయాల్సిన పరిస్థితి ఉంటుంది.

రక్షణ గోడలు కరువు

కోదాడ పెద్దచెరువు అలుగు నీరు పోవడానికి 50సంవత్సరాల క్రితం నిర్మించిన వంతెనకు ఇరువైపులా కనీసం రక్షణ గోడలు లేవు. దీంతో రాత్రి సమయంలో పలువురు వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఈ రోడ్డులో ఖమ్మం జిల్లా నాయకన్‌గూడెం వరకు వెళ్లాల్సినవారు ఇక్కడి నుంచే ప్రయాణం చేయాల్సి ఉంటుంది. అనంతగిరిలో ఉన్న ఓ ఇంజనీరింగ్ కళాశాలలో దాదాపు 4వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ కళాశాలకు చెందిన 50పైగా బస్సులు ఇక్కడి నుంచే వెళ్తుంటాయి. వంతెన ఇరుకుగా ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రెయిలింగ్ లేకపోవడం రోడ్డు మార్జిన్ కూడా లేకపోవడంతో పాటు అంచున పెద్ద గుంత ఉండడంతో అందులో పడితే మృతిచెందడం ఖాయమని పలువురు వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ వంతెనను విస్తరించడంతో పాటు రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి



కోదాడ-అనంతగిరి రోడ్డులో ఉన్న పెద్దచెరువు వంతెన ప్రమాదకరంగా ఉంది. వంతెన వద్ద ఇరుకుగా ఉండడంతో పాటు రక్షణ గోడలు లేకపోవడంతో ద్విచక్ర వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. అంతే కాకుండా వర్షాకాలంలో చెరువు అలుగు ఉధృతంగా పారి వంతెన పైనుంచి రోడ్డుమీద ప్రవహిస్తుంది. అధికారులు ఈ వంతెనను వెంటనే విస్తరించి రక్షణ గోడలు ఏర్పాటు చేయాలి.

– ఈదుల కృష్ణయ్య, న్యాయవాది, అనంతగిరి

మంత్రి, ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న నాయకులు, రైతులు

మోతె : మండలంలో ఎండుతున్న వరిపంటలకు పాలేరు రిజర్వాయర్ నుంచి సాగునీరు అందించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి చిత్రపటాలకు ఆదివారం పాలేరు బ్రిడ్జిపై కాంగ్రెస్ నాయకులు, రైతులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాల్లో నీరులేక ఎండుతున్న వరిపంటల పరిస్థితిని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతికి వివరించడంతో స్పందించి పాలేరు నుంచి మండలానికి సాగు నీరు అందించారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పుల్లారావు, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ ముదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, నాయకులు పులి ఈదయ్య, నర్సింహాపురం గ్రామ శాఖ అధ్యక్షుడు టి.అశోక్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా

అనంతగిరి : మండలంలోని కొత్తగూడెం గ్రామ శివారులో గల పాలేరువాగు నుంచి ఇసుక అక్రమంగా రవాణా జోరుగా సాగుతోంది. రెండు రోజులుగా ఇష్టానుసారంగా తరలిస్తున్నా ఏ ఒక్క అధికారి కూడా పట్టించుకోవడం లేదు. శని, ఆదివారాలు సెలవు రోజులు కావడంతో అధికారుల పట్టింపు కరువైంది. ప్రభుత్వ సెలవు రోజుల్లోనూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎటువంటి ఆటంకం లేకుండా ఇసుక అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టి ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చూడాలని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.



కొత్తగూడెంలోని పాలేరువాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు

భాషా పండితుల సమస్యలు పరిష్కరించాలి



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న భాషా పండితులు

కోదాడ : భాషా పండితులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.అబ్దుల్లా కోరారు. ఆదివారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన పండితుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2005/1 యాక్ట్‌ను రద్దు చేసి సర్వీస్‌రూల్స్‌ను మార్చి పండితులకు జూనియర్ లెక్చరర్, డిప్యూటీ డీఈఓలుగా ప్రమోషన్స్ ఇవ్వాలని ఆయన కోరారు. బాషా పండితులకు ప్రమోషన్లు ఇప్పించడానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. 20సంవత్సరాలుగా ప్రమోషన్‌లు లేక ఇబ్బంది పడుతున్న తెలుగు, హిందీ, ఉర్దూ భాషా పండితులతో పాటు పీఈటీలకు ప్రమోషన్లు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు గుంటి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో భిక్షపతి, లక్ష్మీనారాయణ, బషీర్, సీతరామశర్మ, పద్మావతి, ఫాతిమా, మోతిలాల్, రాములు, రవీంద్ర, శ్రీనివాసరావు, కృష్ణవేణి, చిన్నప్ప, గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కమిటీ సభ్యులు, అర్చకులు



హోమంలో పాల్గొన్న సభ్యులు, భక్తులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని గోవిందపురంలో శ్రీహనుమత్ లక్ష్మణ సహిత శ్రీ సీతారామ చంద్రస్వామి దేవాలయ పునర్నిర్మాణానికి ఆదివారం భూమి పూజ నిర్వహించారు. అర్చకుడు శ్రీనరగిరినాథుని రాఘవాచార్యులు, రంగభట్రాచార్యుల ఆధ్వర్యంలో మంత్రోచ్చరణ మధ్య శంకుస్థాపన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత గణపతి పూజ, పుణ్యాహవచనం, హోమం, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఇట్టిమల్ల జ్యోతి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బుల్లెద్దు ధనమ్మ జైలు, కోశాధికారి ఊదరి రంజిత్ అనూష, ఇట్టిమల్ల బెంజిమెన్ తిరుపమ్మ, నాయకులు సామల శివారెడ్డి, దొంతగాని శ్రీనివాస్, కోలా నాగేశ్వరరావు, జి.చిన్నవెంకటరెడ్డి, టి.వెంకటరెడ్డి, టి.శేఖర్‌రెడ్డి, కొట్టు బాబు, చంద్రశేఖర్‌రావు, రవీందర్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి గోపి

మునగాల : మండలంలోని రేపాల శివారులో గల శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా నర్సింహులగూడెం కేవీపీఎస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లాస్థాయి పోటీలను ఆదివారం ఆ సంఘం జిల్లా కార్యదర్శి కోట గోపి సీనియర్ క్రికెట్ క్రీడాకారుడు మేకల రామారావుతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను పోత్సహించడానికి క్రికెట్ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడల్లో నైపుణ్యం, ప్రతిభగల క్రీడాకారులు పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.12,116లు, ద్వితీయ బహుమతి రూ.8,116లు, తృతీయ బహుమతి రూ.5,116, చతుర్థ బహుమతి రూ.4,116ల నగదుతో పాటు షీల్డులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన క్రికెట్ క్రీడాకారులు మెంతబోయిన కృష్ణ, పెద్ది సురేష్, గొబ్బి నాగరాజు, మద్దెల జాను, గ్రామపెద్దలు సొంపంగు నర్సయ్య, పిడమర్తి నరేష్, సొంపంగు లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై తీరుపై తహసీల్దార్ అసహనం



మోతె పోలీస్‌స్టేషన్‌లో బెంచ్‌పై కూర్చున్న తహసీల్దార్ శ్రీధర్

మోతె: మండలంలో గత ఐదు రోజుల క్రితం తహసీల్దార్ కార్యాలయలంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు గిర్దావర్లను సూర్యాపేట కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సస్పెండ్ చేశారు. ఈమేరకు మోతె మండలంలో కొంత మంది రెవెన్యూ సిబ్బందితో పాటు మరి కొంతమందిని స్థానిక పోలీసులు విచారిస్తున్నారు. మోతె మండలానికి ఇన్‌చార్జ్‌గా వచ్చిన తహసీల్దార్ శ్రీధర్‌ను ఆదివారం స్థానిక ఎస్సై యాదవేందర్‌రెడ్డి పోలీస్‌స్టేషన్‌కు రావాల్సిందిగా తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన స్టేషన్‌కు వెళ్లారు. ఆ సమయంలో ఎస్సై లేకపోవడంతో తమను స్టేషన్‌కు పిలిపించి, ఆయన ఎక్కడ వెళ్లారని అసహనం వ్యక్తం చేశారు. స్టేషన్ సిబ్బంది కూడా తమను గుర్తించలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ బెంచ్‌పై కూర్చున్నారు.

అక్రమంగా చెరువు మట్టి తరలింపు

చివ్వెంల : సూర్యాపేటకు చెందిన కొంతమంది వ్యాపారులు తమ లాభార్జన కోసం మండల కేంద్రంలోని చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు పక్కనే చెరువు ఉన్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వ్యాపారులు ట్రాక్టర్ ఒక ట్రిప్పుకు సమీప గ్రామాలకు రూ.500, సూర్యాపేటకు రూ.1000 వసూలు చేస్తూ లాభాలు గడిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా మట్టి తరలిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



చెరువు వద్ద ఉన్న జేసీబీ, ట్రాక్టర్లు

రవన్న ఆశయాలను సాధిద్దాం



కోదాడరూరల్ : రవన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కోదాడరూరల్ : సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ మాజీ రాష్ట్ర కార్యదర్శి రాయల సుభాష్ చంద్రబోష్ (రవన్న) ఆశయాలను సాధిద్దామని అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి అన్నారు. ఆదివారం పట్టణంలోని లాల్‌బంగ్లా వద్ద రవన్న 9వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. తన జీవితాన్ని పీడిత ప్రజల విముక్తికై అంకితం చేసిన ఆదర్శ విప్లవోద్యమ నేత రవన్న అని గుర్తుచేశారు. తెలంగాణ పోరాట వారసత్వం కలిగిన కుటుంబంలో పుట్టి ఉన్నత చదువులు మధ్యలో వదిలేసి నక్సల్బరీ ప్రేరణతో ఉద్యమ బాటపట్టి పేదప్రజల సమస్యలపై అనేక ఉద్యమాలు చేశారని అన్నారు. ఈ నెల 11న ఖమ్మంలో జరిగే రవన్న సంస్మరణ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి వక్కవంతుల నరసింహారావు, అలుగుబెల్లి సత్యనారాయణరెడ్డి, పోకల మైసయ్య, వీరబాబు, సైదులు, నరసింహరావు, గౌస్, సలీం, సాలమ్మ తదితరులు ఉన్నారు.

సభను జయప్రదం చేయాలి

మునగాల : సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా, కేంద్ర కమిటీ సభ్యుడిగా పనిచేసిన రాయల సుభాష్‌చంద్రబోస్ అలియాస్ రవన్న వర్ధంతి సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకుడు ధరావత్ రవి అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని కొక్కిరేణిలో గ్రామశాఖ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వర్ధంతి సభకు సబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎల్లావుల సైదులు, గ్రామశాఖ నాయకులు వీరబోయిన బాలయ్య, కోటయ్య, బ్రహ్మం, రామాంజి, కోటయ్య, వెంకన్న, కిట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

వర్ధంతి సభ పోస్టర్ల ఆవిష్కరణ

గరిడేపల్లి : ఖమ్మంలో ఈ నెల 11న నిర్వహించే రాయల సుభాష్‌చంద్రబోస్ (రవన్న) వర్ధంతి సభను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు కామళ్ల శ్రీను అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గడ్డిపల్లిలో వర్ధంతి సభకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రవన్న ప్రతిఘటన పోరాట వారసత్వం పునికిపుచ్చుకొని నూతన ప్రజాస్వామ్య వ్యవస్థ బడా కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేసి ప్రజా ఉద్యమాలను ఎన్నో నిర్మించారని అన్నారు. చిన్నతనంలో విద్యార్థి నాయకుడిగా పీడీఎస్‌యూలో చురుకైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. సభకు ప్రజలు, ప్రజాస్వామికవాదులు, కవులు, కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అనంతు లింగయ్య, తండు శ్రీనివాస్, పెండెం వీరస్వామి, కారింగుల సతీష్, చింతమల్ల అంజయ్య, గునుగుంట్ల గోపయ్య, షేక్ అత్తార్, మామిడి సైదులు, సలిగంటి సైదులు పాల్గొన్నారు.



మునగాల : పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు



గరిడేపల్లి : పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

విలువలతో కూడిన విద్యను అందించాలి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న పాఠశాల యాజమాన్యం, అతిథితులు

కోదాడరూరల్ : విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని పట్టణంలోని ప్రముఖ వైద్యులు డాక్టర్ గౌరీనాథ్, డాక్టర్ నిర్మల, మాజీ కౌన్సిలర్ తిపిరిశెట్టి సుశీల అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆదిత్య స్కూల్ వార్షికోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులు చదువే లక్ష్యంగా కాకుండా వారికి మానవ సంబంధాలు, సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి అలరించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ కొండపల్లి హైందవి, మట్టా పుల్లయ్య, గంధం బంగారు, గూడూరు అంజలి, మహబూబా, శ్వేత, వనిత తదితరులు ఉన్నారు.

పోరుబాటను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న హుస్సేన్

హుజూర్‌నగర్‌రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం తలపెట్టిన పోరుబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి పోషణబోయిన హుస్సేన్ కోరారు. ఆదివారం మండల పరిధిలోని గోపాలపురంలో నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాలకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పార్టీ తరుపున గ్రామ గ్రామాన సర్వే నిర్వహించి ఈ నెల 26న తహసీల్దార్ కార్యాలయం ఎదుట, కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ప్రజల దరఖాస్తులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు సిద్దేల వెంకటయ్య, చీకూరి తిరుపతయ్య, మండల కమిటీ సభ్యులు వెంకటరెడ్డి, భిక్షం, సైదా, నర్సింహాచారి, వీరస్వామి, సైదులు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా గోపాలమిత్ర భవనం

నడిగూడెం : మండల పరిధిలోని కరివిరాలలో మూగజీవాలకు వైద్య సేవలందించేందుకుగాను 13ఏళ్ల కిందట పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో రూ.10లక్షలతో గోపాలమిత్ర భవనం నిర్మించారు. నాటి నుంచి నేటి వరకు ఆ భవనాన్ని ప్రారంభించలేదు. దీంతో గోపాలమిత్ర గ్రామానికి చెందిన పశువులకు గ్రామపంచాయతీ కార్యాలయం వద్దనే వైద్యసేవలందిస్తున్నారు. ఇప్పటికే ఆ భవనం శిథిలావస్థకు చేరుతుంది. ఆ భవనంలో అన్ని మౌలిక వసతులు సైతం ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ భవనానికి మరమ్మతులు చేయించి, వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కరివిరాలలో నిరుపయోగంగా ఉన్న గోపాలమిత్ర భవనం

ఆర్యవైశ్య సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలిగా ఉమ



మహిళా అధ్యక్షురాలిని సన్మానిస్తున్న కోదాడ వాసవీ క్లబ్ ప్రతినిధులు

కోదాడ : పట్టణానికి చెందిన గరిణె ఉమామహేశ్వరి ఆర్యవైశ్య సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ సంఘం నాయకులు ఆదివారం తెలిపారు. పట్టణానికి చెందిన మహిళకు జిల్లా పదవి రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరిని ఇమ్మడి రమేష్, వంగవేటి శ్రీనివాసరావు, పబ్బిశెట్టి సతీష్, దివ్వెల రామారావు, ఇమ్మడి అనంతచక్రవర్తి, వంగవేటి భరత్‌చంద్ర తదితరులు అభినందించారు. అదే విధంగా కోదాడ వాసవీ క్లబ్ అధ్యక్షుడు ఎస్ఎస్ రావు ఆధ్వర్యంలో స్థానికంగా ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పత్తి నరేందర్, వెంపటి ప్రసాద్, బెతిదే భరత్, బోనాల సైదారావు, వంగవేటి నాగరాజు, ఇమ్మడి సతీష్, బండారు శ్రీనివాసరావు, రంగా కోటేశ్వరరావు, గుడుగుంట్ల సాయి, గరిణే శ్రీధర్ పాల్గొన్నారు.

వీవీఎం స్కూల్‌కు ఎక్సలెన్స్ అవార్డు



అవార్డు, ప్రశంసాపత్రం అందుకుంటున్న హెచ్‌ఎం కుసుమ

హుజూర్‌నగర్ : రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో గత నెలలో ఖమ్మంలో నిర్వహించి ఇండియన్ బ్రిలియంట్ ఒలింపియాడ్ టాలెంట్ టెస్ట్‌లో పట్టణంలోని వీవీఎం పాఠశాల 4వ తరగతి విద్యార్థి అఖిల్ క్రియేటివ్ డ్రాయింగ్‌లో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారు. అంతే కాకుండా ఆ పాఠశాలకు స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాయ గాన సభలో నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకులు హెచ్‌ఎం కుసుమ, విద్యార్థి అఖిల్‌కు అవార్డు, ప్రశంసాపత్రాలు అందజేసి సన్మానించారు. కాగా ఆదివారం పాఠశాలలో కరస్పాండెంట్ గాలి సుందరి, ఉపాధ్యాయులు వారిని అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.